శ్రీ రమణ జ్యోతి
నవంబర్ 2019
Sri Ramana Jyothi
November 2019

ఈ సంచికలో ...
IN THIS ISSUE ...

1. డా॥ కే.యస్. గారి 64వ ప్రవచనం — డా॥ వి. రామదాస్ మూర్తి 3
2. అనుస్మరణీయులు
శ్రీ పింగళి సూర్యసుందరం — శైలజ పింగళి 14
3. శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు — కాట్రావులపల్లి సుబ్బలక్ష్మి 22
4. With a Calm Mind, all Problems can be Tackled — Dr.K. Subrahmanian 30
5. Kavyakantha's Chatvarimsat — V. Krithivasan 34
6. Lest We Forget - Sri C.V.K. Murthy 37
7. Saints of Periapuranam Kungiliya Kalaya Nayanar 48

## Events in Sri Ramana Kendram in November

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 12th November (Every 2nd Saturday of the month) Uma Sahasram recitation from 12.00 noon - 5.00 p.m.
3. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
4. 17th November - Punarvasu Satsant - 6.00 - 7.30 p.m.

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్
(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)

# భగవాన్ రమణమహర్షి - మోరార్జీ దేశాయ్ స్మృతులు

డా॥ కే.యస్. గారి 64వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

## జాతీయతా భావాలు

కర్తవ్యం, ఒక కృతజ్ఞతాభావం కారణంగా నేను భగవాన్ రమణ మహర్షిని గురించి మాట్లాడడం విధిగా పెట్టుకున్నాను. శ్రోతలు భగవాన్ ఎంత శక్తిమంతులు అని ఆలోచించాలి. ముఖ్యమైన దేమిటంటే విన్న విషయాలు మిమ్మల్ని భగవాన్‌ను గురించి ఆలోచింప జేయాలి గాని మాట్లాడుతున్న వారిపై ధ్యాస మరల్చ కూడదు. భగవాన్ ఏమి చేయగలరు అన్నది మనం కలలో కూడ ఊహించలేము.

భగవాన్‌కు పూర్తిగా అంకితమైన ఒక కుటుంబంలో పుట్టి పెరిగిన వాడిని నేను. సుమారు 12 సం॥ల వయసులో గాంధీజీ చేత మిక్కిలి ప్రభావితుడైనవాడిని. ఆయన ఉపన్యాసాలు చదివే వాడిని. ఆయనను గురించిన చర్చలను శ్రద్ధతో గమనించేవాడిని. అదే సమయంలో గాంధీజీ చేత ప్రభావితులైన వారి సాంగత్యంలో వుండేవాడిని. మీలో కొంతమందికి విశ్వనాథస్వామి గురించి తెలిసి వుంటుంది. నిజానికి, భగవాన్ వద్దకు రావడానికి ముందు ఆయన కూడ గాంధీజీ చేత ప్రభావితుడైన వాడే. ఆయన ఎల్లప్పుడూ ఖాదీ వస్త్రాలనే ధరించేవాడు. అలాగే మురుగనార్‌పై కూడ గాంధీజీ ప్రభావం గొప్పగా వుండేది. భగవాన్ దరికి చేరడానికి ముందు

మురుగనార్ దేశ స్వాతంత్ర్యం గురించి ఎన్నో పద్యాలు రచించారు. గాంధీగారి గురించి వ్రాశారో, లేదో నాకు తెలీదు. యథార్థానికి, భగవాన్ సోఫాపై పరచిన దుప్పట్లు ఖాదీవే. మహర్షి కౌపీనం కూడా ఖద్దరే.

సందర్భం వచ్చినప్పుడు గాంధీజీ గురించి భగవాన్ గొప్పగా మాట్లాడేవారు. అలాగే గాంధీగారికి కూడ భగవాన్ పట్ల ఎంతో గౌరవభావం వుండేది. అలసి, వేసారి పోయి వుంటే రమణా శ్రమానికి వెళ్ళి శక్తిమంతులై మళ్ళీ పుంజుకోండి అని గాంధీగారు కాంగ్రెస్ కార్యకర్తలకు సలహా ఇచ్చేవారు. దానిని అనుసరించి సరోజినీ నాయుడు, రాజేంద్రప్రసాద్, మరి ఇంకెందరో స్వాతంత్ర్యం కోసం పోరాడుతుండిన దేశభక్తులు దాన్ని పాటించి లాభం పొందారు. భగవాన్ ఎలాంటి అనుభవాలను ప్రసాదించే వారో మీరు గ్రహిస్తారని ఇదంతా చెబుతున్నాను. ఎందుకు ఫలానా సందర్భాలు ఏర్పడతాయని అప్పటికి అప్పుడు మీరు తెలుసు కోలేరు.

## దుస్తుల్లో మార్పు

సుమారు 18 సం॥ వయసప్పుడు, నేను బి.ఏ. (ఆనర్స్) చదువుతున్న రోజుల్లో నాకు షోకైన దుస్తులు, వగైరాల పట్ల విపరీతమైన విముఖత ఏర్పడింది. నేను అతి సాధారణమైన జీవితాన్ని గడపాలనుకునేవాడిని. చొక్కా, బనియన్ కూడ ధరించ డానికి ఇష్టపడేవాడిని కాను. అలాగే, చెప్పులు వేసుకునే వాడిని కాదు, కూడ. అలా కాలేజ్‌కు వెళ్ళేవాడిని. చూసిన వాళ్ళు నాకు

మతి సరిగాలేదని అనుకునే వాళ్ళు. అప్పటి నా ప్రొఫెసర్లు, బ్రిటిష్‌వాళ్ళు, ఎందుకిలా చేస్తున్నావు అని అడిగేవారు. నాకు ఇలా వుండాలని అనిపిస్తుందని బదులిచ్చేవాడిని. సరే, కాని క్లాసులోకి వచ్చేటప్పుడు కనీసం టవల్ కప్పుకొనమని చెప్పారు. అలాగ చేశాను. ఆశ్రమానికి కూడ ఆ టవల్ కప్పుకుని వెళ్ళేవాడిని. భగవాన్ ముందు కూర్చున్నప్పుడు వారు నా వేషం గురించి ప్రస్తావిస్తారని ఆశించాను. ఆరు నెలలు గడిచినప్పటికీ, ఏమీ జరగలేదు.

ఒకరోజు కాషాయం ధరించిన బ్రిటిష్ భక్తుడొకరు భగవాన్‌కు సాష్టాంగ నమస్కారం చేశాడు. ఈ ఉదంతం నేను చూశానో లేదా ఎవరో చెప్పగా విన్నానో జ్ఞాపకం లేదు. కాని “మీరు ఈ ప్రపంచాన్ని త్యజించారని చెప్పడానికి దుస్తులను మార్చడమెందుకు? అంతరంగా మార్పు జరిగివుంటే మంచిది గాని దుస్తుల మార్పు కారణంగా మార్పురాదు” అన్నారు భగవాన్. ఈ సంఘటన నన్ను సుమారు రెండు వారాల పాటు కలవరపెట్టింది. నేను ఒక్కడిని వేరుగా ప్రవర్తించడం ఎందుకు అన్న ఆలోచన వచ్చింది. షర్ట్‌ను, చెప్పులను వదలిపెట్టాల్సిన అవసరం లేదు. తప్పు చేస్తున్నానా? ఆఖరుకు అహంను పెంచుకోవడం జరుగుతుందా? నేను గాంధీజీ, లేదా భగవాన్ లాగా వున్నానని ఋజువు చేయాలనుకొంటున్నావా? రెండు, మూడు వారాల్లో, నా మీద నాకే సిగ్గు వేసింది, భయపడ్డాను కూడ.

మన మనసు ఎంత చమత్కారం చూపిస్తుందంటే, వ్యక్తి తనంతట తాను చేసిన పనుల ఫలితాలను నిజంగా అర్థం చేసుకొనలేని విధంగా చేస్తుంది. అది అసాధారణమైన విషయం. నేను షర్టు, చెప్పులను తిరిగి వేసుకోవడం మొదలుపెట్టాను. మనం మామూలు వస్తువు అనుకొన్నది ఆ తరువాత ఎప్పుడో ఎంతో అవసరమైనది అనిపించవచ్చు. చెప్పులు తొడగని రోజుల్లో, నేను రమణాశ్రమం నుండి స్టేషన్‌కు వెళ్తున్నప్పుడు, బాగా ఎండగా వుంది. ఆ రోజుల్లో, ఆటోలు, రిక్షాలు లేవు, ఒక్క జట్కా (గుఱ్ఱం బండి) తప్ప. వంద గజాలు నడిచేటప్పటికే, బాగా వేడెక్కిన రోడ్డు మీద కాళ్ళు విపరీతంగా మండసాగాయి. ఏమీ తోచక తిరిగి ఆశ్రమానికి పరుగెత్తి, ఎండ తగ్గాక సాయంత్రం రైలుకు వెళ్దామా అని అనుకుంటున్న సమయంలో, రోడ్డు ప్రక్కగా కొంచెం ఎండుగడ్డి కనిపించింది. ముందు దాని మీద కాళ్ళుపెట్టి, ముందుకు చూస్తే, వరుసగా రోడ్డు ప్రక్కన అక్కడక్కడ అలాగ గడ్డి కనిపించింది. బహుశః ఆ దారిలో వెళ్ళిన బండి నుండి అది జారి పడిపోయింది కాబోలు. దాని మీద కాళ్ళు పెట్టుకుంటూ స్టేషన్‌కు నడవగలిగాను. ఎందుకూ పనికిరానిదన్నది అలా ఉపయోగపడింది.

## స్వతంత్రంగా ఏమీ చేయలేము

అలాంటివి మనం ఏర్పాటు చేసుకొన్నవా? ప్రతిదీ ముందే నిర్ణయింపబడి వుంటుందని, దైవ సంకల్పంతో జరిగే అన్నిటిని మనం అంగీకరించాలి. కాని మన శక్తి, స్తోమత మేరకు ప్రయత్నం

మాత్రం చేయాలి. మనం స్వతంత్రంగా చేయగలిగింది ఒక్కటే, - 'నీవు ఎవరు' అన్నది తెలుసుకోవాలి. అది చేత కానప్పుడు భగవంతునికి సంపూర్ణంగా శరణాగతి ఒక్కటే మార్గం.

మరొక విషయం. యువకుడిగా వున్నప్పుడు రమణాశ్రమానికి వెళ్ళిన ప్రతిసారి నాకు ఒక సంగతి గురించి ఇబ్బందిగా వుండేది. ఆ రోజుల్లో గాంధీజీ, హరిజనుల పట్ల ఆయన ప్రవర్తన, నన్ను ప్రభావితం చేసేది. భగవాన్ వైపు చూస్తూ, నా మనసులోనే ఇక్కడ అంతా కూడ చాలా గొప్పగా వుంది, కాని ఎందుకు భగవాన్ భోజనశాల మధ్యలో ఒక అడ్డు తెర వుంచారు? దానికి ఒక వైపు బ్రాహ్మణులు, మరొకవైపు ఇతరులు, కూర్చుంటారు? మీ సమక్షంలో ఇలాంటిది ఎందుకు జరుగుతోంది? అని అనుకొనే వాడిని. మహర్షి మాత్రం ఎదురుగా హాలులో మధ్యకు బ్రాహ్మణులు కూర్చొనే వైపు కాకుండ కొంచెం ఇవతలికి కూర్చునే వారు. కాని అందరికీ కనిపించేవారు. తెర అయితే వుండేది.

ఇది నాకు ఎంతో ఇబ్బందికరంగా అనిపించేది. ఎందరో ఈ విషయం గురించి అడిగితే, నాకు తెలియదని చెప్పేవాడిని. భగవాన్ యొక్క గొప్ప భక్తులు కూడ ఈ ప్రశ్న వేస్తే సమాధానం వచ్చేది కాదు. తాముగా భగవాన్ ఎలాంటి భేదం చూపించేవారు కారు. మీకు అలాంటి తేడా లేకుంటే, ఎక్కడైన కూర్చోవచ్చు అనే వారు. కాని రమణాశ్రమాన్ని కారణంగా చూపించి, మీరు ఇళ్ళలో ఆచరించే దానికి భిన్నంగా చేయవలసిన పని లేదు.

అలాంటి ఉద్దేశం వుండి కూడ ఇక్కడ వేరుగా చేస్తే దానిని వంచనగానే భావించాలి అన్నారు.

సుమారు 10 సం॥ల క్రితం నాకు మొరార్జీ దేశాయిని కలవాలనిపించింది. ఒక కార్డు వ్రాస్తూ, "మీరు రాజకీయవేత్తగా వున్నారన్న ఉద్దేశంతో మిమ్మల్ని కలవదలచుకోలేదు. మీరు భగవాన్ రమణమహర్షిని కలిశారని విన్నాను. మహర్షి గురించి మీ అభిప్రాయాలను తెలుసుకోవాలని రాదలచుకున్నాను" అని వ్రాశాను. మొరార్జీ మంచి కట్టుబాట్లు పాటించే మనిషని మీకు తెలిసి వుండవచ్చు. ఎవరైన ఆయనకు ఉత్తరం వ్రాస్తే, ఒక వారంలో జవాబు వచ్చేది. "మీరు ఏ రోజైన 10 గంటల నుండి 5 గంటల లోపు రావచ్చు" అని జవాబు వచ్చింది. ఆ రోజుల్లో ముఖ్యులకు రక్షణ అంటూ ఏమీ వుండేది కాదు. నేను నేరుగా ఇంట్లోకి వెళ్ళాను. ఆయన ఒక మంచం మీద కూర్చొని వున్నారు. మరొక మంచమూ, దగ్గరిగా ఒక టెలిఫోన్ తప్ప మరేమీ ఆర్భాటాలు లేవు.

సంభాషణ మొదలు పెడుతూ "మీరు రమణమహర్షిని కలిశారని విన్నాను, వారి గురించి మీరేమి చెబుతారు" అని అడిగాను. "మహర్షి గురించి ఏమని చెప్పగలను? ఆయనకు తెలియనిది ఏముంది? ఆయన స్వయాన శివుడే! నేను అక్కడ ఒక్క రోజే వున్నాను. "సుబ్రహ్మణియన్, నమ్ము, నమ్మకపో. ఆయన జంతువులు, పక్షులతో మాట్లాడి వాటిని అర్థం చేసుకునేవాడు. అలాంటిది నేను ఇంకెక్కడ చూడలేదు. ఆయన నుండి సెలవు

తీసుకునేటప్పుడు మహర్షి 'భోజనం చేసి వెళ్ళు' అన్నారు. నేను ఆయన గొప్ప ఆశీర్వాదాన్ని పొందినట్లు భావించాను" అంటూ కన్నీళ్ళు ఆపుకోలేక పోయాడు.

## మహర్షి, గాంధీజీ

భోజనశాలలో పరిస్థితి గురించి చెబుతూ మోరార్జీ ఇలా అన్నారు: "సుబ్రహ్మణియన్, భగవాన్ యొక్క విశిష్టతను గురించి చెప్పాలంటే ఆయన భగవంతుడే. కుల, వర్గాల భేదత్వానికి అతీతుడు. కాని భోజనశాలలో ఆ విచక్షణ కనిపిస్తుంది. భగవాన్ మాత్రం భక్తులు ఆ విచక్షణను పాటించదలచుకుంటే, వాళ్ళను అలాగ చేయవద్దని చెప్పేవారు కాదు. వాళ్ళ ఇష్టాయిష్టాల ప్రకారం చేయనిచ్చే వారు. తాము చెబుతూ వచ్చిన విషయాలను ఎంతో కాలం నుండి గమనించి కూడ అలా విచక్షణ చూపుతున్నారంటే కూడ ఆయన పట్టించుకోలేదు.

గాంధీజీ కూడ ఒక అసాధారణ వ్యక్తి. ఆయన వెంబడి తిరిగాను, ఆయనంటే ఎంతో గౌరవం. కాని ఆయన నమ్మిన మూల సూత్రాల విషయంలో మాత్రం ఆయన కఠినంగా వ్యవహరించే వారు. ఎవరైన భిన్నంగా చేస్తున్నట్లు తెలిస్తే తాము చెప్పిన లాగ నడుచుకోమనేవారు. వాళ్ళిద్దరిలో భేదం మీకే తెలుస్తుంది. నేను మంచి ప్రవర్తన అనుకున్నది అవతలి వారు పాటించాలన్న ఉద్దేశం వుంటుంది. భగవాన్ ఎలాంటి స్థాయిలో వుండేవారని ఈ విషయంలో అర్థమైపోతుంది. గాంధీజీ మనసు పరిశుద్ధమైనది.

భగవాన్‌కు మనసన్నదే లేదు. ఆయనకు ఇతరులపై ఏ అభిప్రాయమూ రుద్దాలన్న ప్రసక్తి లేదు. ఆయన స్వతంత్రుడు, ఎదుటవాళ్ళకు ఆ స్వతంత్రాన్ని ఇచ్చేవారు.

గాంధీజీ జీవితంలో ఒక కార్యానికి కట్టుబడినవాడు. భగవాన్ భగవంతుడే. మహర్షి ఎవరినీ ఎందుకు అబద్ధాలు చెబుతున్నావని ఎన్నడూ అనలేదు. అందరినీ వాళ్ళు వున్నదున్నట్లుగా చూసేవారు. ఒకరిని మారమని అంటూ ఎప్పుడూ ప్రయత్నం చేయలేదు. నేను భగవాన్‌తో వున్నప్పుడు నాకు బాగా నచ్చినది ఆయనలోని ఆ గుణమే. బ్రాహ్మణులు, ఇతరుల మధ్య అలా చాటు ఏర్పాటు చేస్తే జనం ఏమనుకుంటారని మనలాంటి వాళ్ళు ఆలోచించి అంగీకరించం. కాని మహర్షి అసలు ఆలోచించడానికి మనసన్నదే ఒకటి లేదు.

అలాంటి భేదం వుండకూడదని మనమూ అనుకోవచ్చు. అయినా మన హృదయాంతరాళంలో మన అభిప్రాయం వేరుగా వుంటుంది. ఉదాహరణకు అందరూ కలిసి కూర్చొని భోజనం చేస్తారనుకుందాం. బాహ్యంగా కొందరి విషయంలో తమ స్వంత నడవడిక తీరులో కుటుంబంలో వివాహం ఇతర వర్ణాలతో చేయాలంటే మనసులోనిది బయటపడుతుంది. వేరే వర్ణస్థుల సంస్కృతి, అలవాట్లు భిన్నంగా వుంటాయి, ఇతరులు ఏమనుకొంటారో అని జంకుతారు. తొలి రోజుల్లో భగవాన్‌కు సేవ చేసిన వాళ్ళు ఇతర వర్ణాలవారే. వారి గురించి వేరుగా ఆయన భావించ

లేదు. సమాజంలో అలాగే ఎన్నో ఇతర అవాంఛిత నమ్మకాలు, వితంతువులను చూస్తే అశుభమన్న లాంటివి వుండేవి. కాని ఆశ్రమ వంటశాలలో మొట్టమొదట అలాంటి స్త్రీలు వండి సేవ చేసేవారు. వారిపట్ల మహర్షికి చెప్పలేనంత జాలి వుండేది. భగవాన్ ఏదో ఒక మామూలు మఠాధిపతి అని భావించరాదు. ఆయన అలాంటి అపనమ్మకాలకు అతీతులు.

ఇప్పటికీ, ఒక వివాదం నడుస్తూనే వుంది. స్త్రీలను జ్ఞానులుగా పరిగణించవచ్చా? వాళ్ళకు సమాధి ఏర్పాటు చేయవచ్చా? ఈ కారణంగా భగవాన్‌ను ఇష్టపడనివారు అలాగ చేయవచ్చా అని ప్రశ్నిస్తూనే వుంటారు. కాని ఆదిశంకరాచార్యుల విషయం మనకు తెలుసు. ఎక్కడో పర్యటనలో వున్న సమయంలో తల్లిగారి మరణ వార్త తెలిసిన వెంటనే తమ గ్రామానికి ఆమె అంత్యక్రియల కోసం వస్తారు. గ్రామంలోని వాళ్ళు అంత్యక్రియలు చేసినవాళ్ళకు ఆస్తి హక్కులు వస్తాయన్న ఆశతో వచ్చారని నిందలు వేశారు. పైగా కార్యక్రమానికి ఎవరూ సహకరించలేదు కూడ. లోక క్షేమం కోసం అవతారమెత్తిన శంకరులవారు ఆమె తనువును భుజాన మోసి, తమ ఇంటి పెరట్లో కార్యక్రమం పూర్తి చేశారు.

## విప్లవాత్మకమైన ఆలోచనలు

భగవాన్ రమణ మహర్షి తమ తల్లికి సమాధి ఏర్పరచాలని ఎప్పుడూ తమంత తాముగా అనలేదు. అంతకు ముందు ఎప్పుడో భగవాన్ స్త్రీలు జ్ఞానులైనప్పుడు వాళ్ళకూ పురుషుల వలెనే సమాధి

నిర్మించాలని అన్న విషయం జ్ఞప్తికి తెచ్చుకొని కావ్యకంఠ గణపతి ముని భగవాన్ తల్లిగారికి సమాధి ఏర్పాటు చేయాలని అన్నారు. శంకరులు, భగవాన్‌లకు ఈ విషయంలో పోలికలున్నాయి. సన్యాసుల తల్లి ముఖాన్ని సూటిగా చూడకూడదన్న ఒక నియమం వుంది. అలా చూడడం వల్ల సన్యాసి మళ్ళీ ఈ లోకంతో సంబంధం ఏర్పరుచుకొంటారని దాని ఉద్దేశం. కాని శంకరాచార్యులు తమ తల్లికి మాట ఇచ్చిన ప్రకారం ఎక్కడ వున్నప్పటికి వచ్చి ఆమె అంత్యక్రియలను జరిపారు. ఆయన సంప్రదాయ మతాచారాలను పాటించేవారని మనం అనుకున్నప్పటికీ, ఆయన విప్లవాత్మకమైన ఆలోచనలు గలవారు కూడ.

ఇక మహర్షి నాయన ఏమి చెబితే అదే ఆఖరుమాట అని చెబుతూ వచ్చారు. ఆ తరువాత సమాధిపై మాతృభూతేశ్వర ఆలయం నిర్మించడం జరిగింది. ఒక వితంతువు సమాధి, ఆపై ఆలయ నిర్మాణం చాలామందికి సమ్మతం కానిది. భగవాన్ మాత్రం వీటి గురించి ఎందుకు ఆలోచిస్తూ వుంటారు. ప్రతి ఒక్కరికి ఒక అభిప్రాయం వుండవచ్చు. అది ఒక ఆలయం. అంతే. భగవంతుని యొక్క కృప వుంటే తప్ప అలాంటి దృక్పథం ఏర్పడే స్థితి వుండదు. తాము బోధించిన విషయాలకు భిన్నంగా ఇతరులను నడుచుకోనివ్వడం అసాధారణమైనదని ఒప్పుకొన వలసిందే. ఒకనెలపాటు, మనం చెబుతూ వచ్చిన దానికే వ్యతిరేకంగా నడుచుకొన్నవారిని ఇన్నాళ్ళు ఇక్కడికి రావడం వల్ల ప్రయోజనం

ఏమిటి? అని కోపగించుకొంటాము. భగవాన్ అంతటి వారు మాత్రమే ఏమి అనకుండ అందరికీ స్వాతంత్ర్యం ఇవ్వగలరు. ఇలాంటిది మనకు అర్థం కాని విషయం.

ఆదిశంకరులు ఇతరులలో తమను, తమలో ఇతరులను చూస్తానవేవారు. మన మీద దయతో సౌందర్యలహరి, శివానంద లహరి వంటి స్తోత్రాలను రచించారు. అందరికీ అది సాధ్యపడదని బహుశః గమనించి వుంటారు. ఒక శ్లోకంలో ఆయన "ప్రభూ! నీవు అన్ని చోట్ల వుంటావని తెలిసి కూడ గుళ్ళను దర్శించాను. అందుకు క్షమించాలి. మీ గురించి ధ్యానం చేస్తున్నానని చెబుతూ వుండినందుకు కూడ క్షమించాలి. అసలు ధ్యానించడానికి వేరే ఏముంది? నీవే అంతర్యామివై, నీవే నా ఆత్మ అని తెలిసి కూడ లోకం కోసం అలాగ చేశాను". మనం దేవాలయాలకు వెళ్తాము. అక్కడ దేవుడిని చూస్తాం. దేవుడు మన హృదయాలలో వున్నది గమనించం. శంకరులు మన కోసమేగాని ఏదో పేరు, ప్రఖ్యాతుల కోసం కాదు. శంకరులు, రమణమహర్షి వంటి మహాత్ములు మన కోసం భూమికి దిగి వచ్చారు అని మొరార్జీ అన్నారు. మామూలు మానవులకు అది అసాధ్యం. సర్వులకూ స్వతంత్రం ఇవ్వ గలగడం తాము స్వతంత్రులైనప్పుడే జరుగుతుంది. ఈ విషయంలో మనం అతి ఉన్నతులైన భగవాన్‌ను గుర్తుంచుకోవాలి. అది మనంతట మనకు చేతకాదు; ఆయన అనుగ్రహం వల్లనే సాధ్యమౌతుంది.

# అనుస్మరణీయులు

(హైదరాబాదులోని శ్రీరమణకేంద్రం ఎంతో ధన్యత గాంచిన కేంద్రం. దీనికి ముఖ్యముగా మూడు కారణాలు. మొదటగా కేంద్ర వ్యవస్థాపకులైన డా. కె. సుబ్రహ్మణియన్ గారు (డా. కె.ఎస్.) శ్రీ భగవాన్ జీవితాన్ని తన జీవితంలో చూపించ గల్గినట్టి మహానుభావులు. కేంద్రంలోని భక్తులకు ఎలా జీవించాలో, ఎలా ప్రేమించాలో నేర్పిన మహా మనీషి. కేంద్రంలో దార్శనికంగా జీవించిన వారు ఉన్నత విలువలను శాశ్వత పునాదులుగా చేయ ప్రయత్నించారు. హైదరాబాదు శ్రీరమణకేంద్రములో ఒకే ఒక ముఖ్యమయిన వ్యక్తి శ్రీ భగవాన్ మాత్రమేనని వారు మరీ మరీ చెబుతూ వుండేవారు. యాజమాన్యపరంగా గానీ, ఆధ్యాత్మిక పరంగా గానీ యెట్టి తారతమ్యాలు లేకుండా వారు జాగ్రత్త పడ్డారు. శ్రీరమణకేంద్రమంటే వారి అర్థము: శ్రీ భగవాన్ ఆయన భక్తులు. అంతే!

డా. కె.ఎస్.గారి వ్యక్తిత్వ ప్రకాశం వల్ల అనేక మహానుభావులు - శ్రీ భగవాన్ దర్శనభాగ్యమూ, వారి సన్నిధి భాగ్యమూ అనుభవించినవారలు - కేంద్రాన్ని దర్శించి భక్తులతో ముచ్చటించి వారిని ప్రభావితులను చేశారు. వీరిలో ముఖ్యులు శ్రీ నిడిముసలి బలరామరెడ్డిగారు, శ్రీ హరీంద్రనాథ చట్టోపాధ్యాయ, శ్రీమతి వజ్రమ్మ (నాయనగారి కుమార్తె), రమణాశ్రమ అధ్యక్షులు కీ.శే. టి.ఎన్. వెంకటరామన్‌గారూ, వారి కుమారులు శ్రీ సుందరం, శ్రీ గణేశన్, శ్రీ మణిగార్ల వంటివారు. వాళ్ళ ప్రవచనాల వల్ల

రమణకేంద్రం ఆధ్యాత్మికత బహు పటిష్టమయిందని చెప్పవచ్చు.

ఇక మూడవ కారణము, డా. కె.ఎస్.గారు శ్రీరమణకేంద్ర నిర్మాణములో అనేక విశిష్టమయిన వ్యక్తులను ఆకర్షించి తను సైన్యముగా మలచుకొన్నారు. వీరిలో కూడా చాలామంది శ్రీ మహర్షి దర్శనభాగ్యము పొందినవారే! శ్రీ గ్రిద్దలూరి కృష్ణమూర్తి గారూ, శ్రీ మాధవపెద్ది రామకృష్ణగారూ, శ్రీ గాజుల రాజేశ్వర రావుగారూ, శ్రీ శిద్దుల సాంబమూర్తి గారు, శ్రీ శివమోహనలాల్ గారూ, శ్రీ మహాపాత్ర దావేగారూ, వీరిలో కొంతమంది. శ్రీరమణ కేంద్ర స్థాపనలోనూ, కేంద్ర పురోభివృద్ధిలోనూ వీరి పాత్ర బహు శ్లాఘనీయం.

ఇక కొందరు సాహితీపరులైన రమణభక్తులు, రమణమహర్షి బోధనలు, మహర్షి రచనలను అనువదించి, తెలుగు భక్తలోకానికి సేవ చేశారు. స్వంత రచనలలో కూడ రమణ తత్త్వాన్ని విడమర్చి చెప్పారు. అటువంటి రచనావ్యాసంగాలను చేసిన వారిలో ముఖ్యులు శ్రీ పింగళి సూర్యసుందరంగారు.

ఈ మహానుభావులలో చాలామంది యిప్పుడు మన మధ్యలో లేరు. వారి జ్ఞాపకాలే మిగిలాయి. వారు చేసిన సేవ మరచి పోకూడదనే ఉద్దేశముతో 'లెస్ట్ వి ఫర్‌గెట్' అన్న శీర్షికతో ఇంగ్లీషు లోను 'అనుస్మరణీయులు' అన్న శీర్షికతో తెలుగులోను యీ భక్తుల జీవిత విశేషాలను వాళ్ళు, కేంద్రానికి చేసిన సేవను పాఠకులకు తెలియపరుస్తున్నాము. ఈ ప్రయత్నంలో తెలుగులో మొట్టమొదటి శీర్షికను శ్రీ సూర్యసుందరంగారు కేంద్రానికి చేసిన సేవా విశేషాలతో అందిస్తున్నాము. - *సంపాదకవర్గం.)*

# శ్రీ పింగళి సూర్య సుందరం

- శైలజ పింగళి

భగవాన్ రమణ మహర్షి "భక్తి జ్ఞానమాత" అని అంటారు. భగవాన్ భక్తులైన శ్రీ పింగళి సూర్యసుందరంగారు జీవితం దీనికి తార్కాణం.

శ్రీ సుందరంగారు తెలుగు సాహితీ దిగ్గజమైన శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారి పుత్రులు. శ్రీ లక్ష్మీకాంతంగారు సుందరకాండ పారాయణం చేస్తున్న సమయంలో, 1930 అక్టోబర్ 17వ తేదీన వీరు జన్మించారు. ఆ కారణం గానే సూర్య సుందరం అని నామకరణం జరిగింది. పేరుకు తగ్గట్టుగానే వీరు ఆజన్మాంతం ఆంజనేయస్వామికి భక్తులు. అంతేకాదు సుమారు మధ్య వయసు వరకు కూడా ఆయన సుందరకాం పారాయణం చేస్తూండేవారు. చాలా మంది తెలుగు వారివలే, ముఖ్యంగా తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి రిటైర్ అయిన వారి తండ్రి గారిలా, సుందరంగారు కూడా తిరుమలేశుని భక్తులు.

గుంటూరు మరియు విశాఖపట్టణం నగరాలలో విద్యాభ్యాసం చేసి, వీరు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా ముఖ్యంగా తమిళనాడులో విధులు నిర్వహించారు. చాలాకాలం పాటు దక్షిణ రైల్వేలో పనిచేశారు. ఇండియన్ ఆడిట్ & అకౌంట్స్ సర్వీస్‌లో ఆఫీసరుగా, కలకత్తా మరియు హైదరాబాద్‌లో విధి నిర్వహణ గావించి, 1988లో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్‌గా హైదరాబాద్‌లో పదవీ విరమణ చేశారు. వీరు తమ కార్య నిర్వహణలో ఎంతో

నిజాయితీగా, నిక్కచ్చిగా నియమాలు పాటించేవారు. చెన్నయ్‌లో ఉన్నప్పుడే వీరు శ్రీ జిడ్డు కృష్ణమూర్తి గారి బోధనల పట్ల ఆకర్షితులై, రాజా అన్నామలై పురంలోని వసంత విహార్‌లో జరిగే కృష్ణజీ ప్రవచనాలకు తప్పక హాజరయ్యే వారు.

శ్రీ కృష్ణమూర్తి గారితో ఆయన సంబంధం నాటకీయంగా ముగిసింది. 1984లో శ్రీ సుందరంగారు కలకత్తాకు బదిలీ అయి వెళ్ళేముందు చివరగా శ్రీకృష్ణమూర్తిగారి ప్రసంగానికి వెళ్లారు. ప్రసంగం అయిపోయింది. కొంతమంది శ్రోతలతో శ్రీ సుందరం గారు కూడా కృష్ణజీకి నమస్కరిస్తూ నిలబడి వున్నారు. కొంత దూరం ముందుకు వెళ్ళిన కృష్ణమూర్తిగారు హఠాత్తుగా వెనుదిరిగి సుందరంగారి దగ్గరకు వచ్చారు. వారు రాగానే సుందరంగారు అప్రయత్నంగా కళ్ళు మూసుకున్నారు. వెంటనే కృష్ణమూర్తిగారు వీరి రెండు చేతులు పట్టుకొని వీరిని చూస్తూ ఆంగ్లంలో "Don't have so much respect for me, Sir. I am a nobody" అన్నారు. ఈ సంఘటన తరువాత సుందరంగారు కృష్ణమూర్తిగారిని కలుసుకోలేదు.

కలకత్తాలో ఉన్నప్పుడు సుందరంగారు తమ క్రింది వాటాలో ఉన్న వారింటికి వెళ్ళారు. వారి టేబుల్ పైన ఉన్న మౌంటెన్ పాత్ పత్రిక చూచి దానిని తెరిచి చూశారు. అందులో భగవాన్ రమణ మహర్షిగారి ఫోటో చూశారు. చూడగానే ''ఈ ఫోటో నా దగ్గరుంటే బాగుండును'', అని మనసులో అనుకున్నారు. విచిత్రంగా ఆ మరునాడు ఆ పత్రికలోని ఆ ఫోటోని కత్తిరించి పొరుగింటి వారు తెచ్చి సుందరంగారికిచ్చారు. సుందరంగారు దానిని పటం

కట్టించారు. అప్పటి నుంచి భగవాన్‌తో వారి సహచర్యం మొదలయ్యింది. రిటైరైన తరువాత హైదరాబాద్‌లోనే స్థిరపడి ఆధ్యాత్మికపరమైన కొన్ని గ్రంథాలు రచించారు. అందులో ముఖ్యమైనవి శ్రీ సత్యసాయిబాబా, ఆదిశంకరులు, కంచి పరమాచార్య, శ్రీ అరవిందులు, యోగి రామసూరత్‌కుమార్ మొదలైనవారి గురించినవి. ఇంకా వీరి తండ్రిగారైన పింగళి లక్ష్మీ కాంతంగారి జీవితచరిత్ర కూడా రచించారు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, సుందరంగారి పదవీవిరమణ సమయంలో, వీరి సహ ఉద్యోగి రెండు పుస్తకాలను బహూకరించారు. అవి (1) బైబిల్ (2) పెరియ పురాణం. సరిగ్గా ఈ రెండు పుస్తకాలనే, భగవాన్ అరుణాచలం రాక ముందు చదివారు. భగవాన్ బోధనల గురించి అధ్యయనం చేసే ప్రయత్నంలో శ్రీ సుందరంగారు హైదరాబాద్ రమణ కేంద్రానికి తరుచు వచ్చేవారు. అలా ప్రొ॥ కె. సుబ్రమణియన్ (డా. కె.ఎస్.) గారితో పరిచయమూ, వారి ప్రోద్బలంతోనే భగవాన్ గురించి వ్రాయబడిన ఎన్నో ఇంగ్లీషు గ్రంథాలను తెలుగువారి సౌకర్యార్థం అనువాదం చేసే మహా ప్రక్రియ మొదలైంది. వీరి మొదటి పుస్తకం 1994లో విడుదలైన 'శ్రీ భగవాన్ విశిష్టత'. ఇది డా. కె.ఎస్. గారు వ్రాసిన 'Uniqueness of Bhagavan' అనే ఆంగ్ల గ్రంథానికి అనువాదం.

1993లో శ్రీ సుందరంగారు మొదటిసారి శ్రీ రమణ ఆశ్రమాన్ని దర్శించారు. ఆ ప్రయాణంలోనే పాండిచ్చేరి, తిరుపతి కూడా వెళ్లారు. భగవాన్ పట్ల, రమణాశ్రమం పట్ల, ఆయన బాగా ఆకర్షితు లయ్యారు. ఆ తర్వాత చాలాసార్లు ఆశ్రమానికి వెళ్ళారు. అలా

ఒకసారి వెళ్ళినప్పుడు ఆశ్రమ ఆర్కైవ్స్‌లోని తెలుగు పుస్తకాలను వర్గీకరించారు. అప్పట్నుంచి ఆయన జీవితం భగవాన్‌కు అంకితమై పోయింది. అలా ఒక దాని తర్వాత ఒకటి అనేక గ్రంథాలు తెలుగులోకి అనువదించారు. అవన్నీ భగవాన్ గురించి కాని, లేక వారు తమ భక్తులను చదవమని చెప్పినవే. ఎన్నో ఆరోగ్య సమస్యలు వచ్చినా, చివరకు హృద్రోగం వచ్చినప్పటికీ సుందరం గారు ఈ పనిని ఆపలేదు.

1996లో డేవిడ్ గాడ్‌మన్ వ్రాసిన 'Be as You are' అనే గ్రంథాన్ని 'నీ సహజ స్థితిలో వుండు' అన్న పేరుతో అనువాదం చేశారు. ఇది తెలుగు ప్రజానీకం మన్ననలను బాగా పొందింది. 1998లో 'ఋభు గీతాసారం' వ్రాశారు. దీనిని ఇంగ్లీష్ మరియు సంస్కృత గ్రంథాల ఆధారంగానే వ్రాశారు. మొత్తం 2000 శ్లోకాలలో నుండి ముఖ్యమైన 700 శ్లోకాలను గ్రహించి తెలుగులోకి అనువదించారు. ఈ మహత్తర కార్యం కేవలం మూడు వారాలలో ముగించారు. వారి మాటలలో చెప్పాలంటే 'ఆ మూడు వారాలు నాకేదో ఆవహించినట్లుగా వ్రాశాను' అన్నారు.

1999లో శ్రీ కావ్యకంఠ గణపతిమునిచే వ్రాయబడిన 'చత్వారింశత్'కు భావార్థం వ్రాశారు. దీనికి మంచి ప్రజాదరణ లభించింది. సుమారు 20,000 కాపీలు ఉచితంగా ఇవ్వబడ్డాయి. బి.వి. నరసింహస్వామిగారు రచించిన 'Self Realisation' ను శ్రీ సుందరంగారు 'ఆత్మ సాక్షాత్కారము' అన్న పేరుతో అనువదించారు. దీనికి 2002 సం॥లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. అదే సంవత్సరం కృష్ణ భిక్షుగారు వ్రాసిన భగవాన్

జీవిత చరిత్ర 'శ్రీరమణ లీల'ను, ఇంగ్లీష్ లోకి తర్జుమా చేశారు సుందరంగారు. భగవాన్ జీవిత చరిత్రనే, ఇతరత్రా లభ్యం కాని కొన్ని అంశాలను చేర్చి శ్రీ రమణీయం' అనే పుస్తకం వ్రాశారు. ప్రొ. లక్ష్మీ నారాయణ్ గారు సంకలనం చేసిన 'Face to Face with Bhagavan' అనే గ్రంథానికి అనువాద గ్రంథంగా "శ్రీరమణ మహర్షితో ముఖాముఖి' వ్రాశారు. ఆ తరువాత 2015లో చివరగా ఆయనకు చాలా ఇష్టమైన 'మహాయోగసారము' వ్రాశారు. ఇది శ్రీ లక్ష్మణ శర్మగారు వ్రాసిన 'Mahayoga' (by WHO) కు సంక్షిప్త గ్రంథము.

ఇలా వారు వ్రాసిన అనేక పుస్తకాలను శ్రీరమణాశ్రమం మరియు హైదరాబాద్ శ్రీరమణ కేంద్రం వారే ప్రచురించారు. వీటితో బాటు ఇంగ్లీష్ మరియు తెలుగులో వారు వ్రాసిన అనేక వ్యాసాలు ప్రముఖ దినపత్రిక, మాసపత్రికలలో ప్రచురిత మయ్యాయి. రేడియో, టి.వి. మాధ్యమాలలో అనేకమార్లు వారు ఉపన్యసించారు కూడ. 2018లో ఆధ్యాత్మిక గురువులపై వారు వ్రాసిన వ్యాసాలు ఆంధ్రజ్యోతి దినపత్రికలో వరుసగా వెలువడ్డాయి. చివరిక్షణం వరకు శ్రీ సుందరంగారు చురుకుగానే వున్నారు.

శ్రీ సుందరంగారు సహజసిద్ధ సంగీత విద్వాంసులు. సంగీత శిక్షణ పొందకపోయినా, పాటలకు బాణీ కుదిర్చి చక్కగా పాడేవారు. రమణకేంద్ర సత్సంగాలలో కూడా అనేకమంది వారిని పాడమని అడిగేవారు. అంతేకాక ఆయన మంచి వక్త కూడా. ఎక్కువగా భగవాన్ గురించే మాట్లాడేవారు. శ్రీ సుందరంగారికి ఒక నిర్దిష్టమైన దినచర్య ఉండేది. ధ్యానము, పూజ, శారీరక వ్యాయామము, రచనా

వ్యాసంగము. ఆయన ఆరోగ్యం అనుమతించిన వరకు ఆయన దినచర్యలో మార్పు ఉండేది కాదు. అభిమానులు అనేకమంది వారిని కలిసేందుకు తరుచు వస్తూండేవారు. వారితో సంతోషంగా ఎన్నో విషయాలు పంచుకునే వారు. వీరే కాక ఆధ్యాత్మిక జగతిలో పేరెన్నికగన్న సద్గురు శివానందమూర్తిగారు, త్రిదండి చినజీయరు స్వామిగారు, జిన్నూరు నాన్నగారు కూడా వచ్చారు.

జనవరి 2019లో, శ్రీ సుందరంగారు వారి తండ్రిగారి 125వ జన్మదిన సందర్భంగా హైదరాబాద్ రవీంద్ర భారతిలో సాహిత్య సభను ఏర్పాటు చేశారు. ఇది తెలంగాణా ప్రభుత్వ భాషా - సాంస్కృతిక సంఘం తరపున ఏర్పాటు చేయబడింది. ఎందరో ప్రముఖులు విచ్చేసి ఉపన్యసించారు. ఆ సభ జయప్రదంగా జరగటం సుందరంగారికి ఎంతో తృప్తినిచ్చింది. కాని ఈ సంఘటన తరువాత వారి ఆరోగ్యం క్రమంగా క్షీణించింది. మే నెలలో ఒక వారం రోజులు హాస్పిటల్‌లో వున్నారు. ఇంటికి వచ్చిన రెండు రోజులకు 25 మే న శ్రీ సుందరంగారు హైదరాబాద్‌లోని వారి నివాసంలోనే అరుణాచలంలో ఐక్యమైనారు. వారికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

*(శ్రీమతి శైలజ పింగళిగారి ఆంగ్ల వ్యాసాన్ని తెలుగులోకి అనువదించిన వారు శ్రీమతి వి.ఎస్. శ్యామ సుందరిగారు)*

# శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# పాపాజీ

**కాట్రావులపల్లి సుబ్బలక్ష్మి**

కఠోపనిషత్ చెప్పిన విధంగా ఎవరినైతే ఆత్మ ఎన్నుకుంటుందో అతని చేత ఆత్మ పొందబడుతుంది. అతనికే ఆత్మ నిజస్వరూప మును ఎరుక పరుస్తుంది. అలాంటి వారిలో పాపాజీ ఒకరు. భగవాన్ నిర్యాణం అనంతరము భగవాన్ బోధనలను తమ సత్సంగాల ద్వారా ప్రపంచం అంతటా వ్యాప్తి చేసిన మహాను భావులలో పాపాజీ ముఖ్యులు. పాపాజీ అసలు పేరు హరివంశ లాల్ పూన్జా. పశ్చిమ పంజాబ్‌లోని ల్యాల్‌పూర్‌లో సరస్వత్ బ్రాహ్మిన్ కుటుంబంలో జన్మించారు. చిన్నప్పటి నుంచి శ్రీకృష్ణుడు అంటే విపరీతమైన భక్తి ఉండటంతో ఆయన ఎప్పుడు అనుకుంటే అప్పుడు కృష్ణుడి దర్శనం అయ్యేది. ఆయన కృష్ణ భక్తి ఎంత తీవ్రంగా ఉండేదంటే ఆయన తలుచుకున్నప్పుడల్లా శ్రీకృష్ణుని దర్శనం లభిస్తుండేది.

## సత్యాన్వేషణ

ఆయనకు 16 ఏళ్ళ ప్రాయంలోనే వివాహం జరిగింది. తండ్రి కోరికపైన మిలిటరీ అకాడమీలో అధికారిగా శిక్షణ పొందుటకు చేరారు. చిన్నప్పటి నుంచి కనిపించిన ప్రతి స్వామిని భగవంతుడిని చూశారా? నాకు చూపగలరా? అని అడిగేవారు. దానికి ఎవరూ సమాధానం ఇవ్వలేక పోయేవాళ్ళు. అయినా పట్టుదల వదల కుండా తను మాత్రం కనిపించిన ప్రతి ఒక్క సాధువును మీరు

చూడకపోయినా చూసిన వారు ఎవరైనా ఉన్నారా? అని అడిగేవారు.

అలాంటి సమయంలో ఒకనాడు భగవాన్‌ను పోలిన సాధువు ఒకరు వారి ఇంటికి వచ్చారు. ఆ సాధువును కూడా అలానే అడిగే సరికి "తప్పకుండా మీకు భగవంతుడిని చూపగలవారు ఉన్నారు, వారే రమణమహర్షి, తిరువణ్ణామలైలో వుంటారు" అని అన్నారు. ఆ ఊరికి ఎలా వెళ్ళాలో అన్ని వివరాలు ఆ సాధువు నుంచీ తెలుసుకున్నారు. అప్పటికే సైన్యంలో ఆఫీసర్‌గా ఉన్న ఆయన తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి భార్యను తన తండ్రి ఇంట వదిలి తను భారతదేశం మొత్తం పర్యటించారు. ఆ సత్యాన్వేషణ లో ఎందరో మహనీయులైన స్వామి రామదాసు, స్వామి శివానంద, స్వామి తపోవన మహరాజ్, ఆనందమయి మాత మొదలైన మహానుభావులందరినీ దర్శించారు. వీళ్ళందరిని కలుసుకోవడానికి దాచుకున్న డబ్బంతా ఖర్చు అవ్వడంతో మద్రాసులో వేరే ఒక ఉద్యోగంలో చేరారు. ఆ యజమాని వారికి ఉద్యోగంలో చేరడానికి ఒక నెల వ్యవధి ఇవ్వడంతో మహర్షి సన్నిధిలో ఉండటానికి వీలు చిక్కింది అనుకొని తిరువణ్ణామలై వెళ్ళారు. అప్పుడు అది 1944వ సంవత్సరము. ఆయన వయస్సు 34 సం॥లు.

## ప్రథమ దర్శనం

తన 34 ఏళ్ళ వయస్సులో మొట్టమొదటిసారిగా రమణా శ్రమానికి వెళ్ళిన వారు అక్కడ హాల్‌లోకి ప్రవేశించే ముందు కిటికిలో నుంచి భగవాన్‌ను చూడగానే అవాక్కయ్యారు. కారణం అక్కడ సోఫా మీద కూర్చున్న భగవాన్ తన ఇంటికి వచ్చిన

సాధువేనని గ్రహించటం. తన మనస్సులో "మా ఇంటికి వచ్చి నన్ను తిరువణ్ణామలైకి వెళ్ళమని చెప్పి నాకంటే ముందుగా రైలులో వచ్చి ఇక్కడ కూర్చున్నారు. చాలా దగాకోరు" అని అనుకొని కోపంతో లోపలికి వెళ్ళకుండానే ఆశ్రమాన్ని విడిచి వెళ్దామను కున్నారు. ఇంతలో అక్కడ ఒకరు ఎందుకు వెళ్తున్నారు భగవాన్‌ను చూడకుండా అని అడగటంతో తను జరిగినదంతా చెప్పారు. వెంటనే ఆయన "మీరు పొరపాటు పడుతున్నారు. మహర్షి గత 48 సం॥లలో ఎప్పుడూ ఈ ఊరు విడిచి ఎక్కడికీ వెళ్ళలేదు. కాకపోతే తమ అతీంద్రియ శక్తులతో మీకు కనబడి ఉండవచ్చు. అప్పుడప్పుడు ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి" అని అన్నారు. ఆ మాటలతో శాంతపడిన వారు కొంత కాలం అక్కడే ఉండటానికి నిశ్చయించుకున్నారు. అదే రోజు భగవాన్ దర్శనానికి మధ్యాహ్నం అనుకోకుండా కుదరడంతో లోపలికి వెళ్ళారు. మహర్షిని సమీపించి ఆవేశంలో పంజాబ్‌లో మా ఇంటికి వచ్చింది మీరే కదా! అని కోపంగా అడిగారు. భగవాన్ మౌనం వహించారు.

అందరినీ అడిగినట్లే భగవాన్‌ను కూడా అంతకు ముందులాగే ఆ రెండు ప్రశ్నలు అడిగారు. దానికి భగవాన్ "నేను భగవంతుడిని చూపలేను, మీరు చూసేటట్లుగా చేయలేను. ఎందుకంటే భగవంతుడు ఒక వస్తువు కాదు, చూచేవాడే భగవంతుడు" అని అన్నారు. ఈ మాటలు ఆయనకి నచ్చలేదు కాని ఇంతలోనే భగవాన్ తన వైపు చూడటంతో ఒక అదృశ్య శక్తి తనలోకి దూసుకు పోతున్నట్లుగా అనిపించింది. మహర్షి తన వైపు అలానే

చూస్తుండటంతో తనలోని సందేహాలన్నీ మటుమాయం అయ్యి అలజడులు అన్నీ తగ్గి ప్రశాంతత ఆవరించింది. అలా అసాధారణమైన అనుభవాన్ని ఆయన పొందారు. అటు పిమ్మట కొంత సమయం తర్వాత ఆత్మవిచారణ చేయమన్న భగవాన్ మాట నచ్చక ఆ కొండకి కొద్దిగా దూరంలో ఉన్న అడవిలో ఒక చోట కూర్చొని కృష్ణనామ జపం చేసుకోవడం ప్రారంభించాడు. అలా వారం రోజులు జపం చేసుకున్న తర్వాత కృష్ణుని దర్శనంతో ఇద్దరు కలిసి ఆడుకుంటుండేవాళ్ళు.

తనకు కృష్ణ దర్శనం తరచూ అవుతుంటుందన్న విషయం గొప్పగా భగవాన్‌కి చెప్పే నిమిత్తం తను మద్రాసు వెళ్ళే ముందు మరొక్కసారి ఆశ్రమానికి వెళ్ళారు. అప్పుడు పాపాజీని భగవాన్ “మీరు ఎక్కడికి వెళ్ళారు? మీరు ఎక్కడ బస చేశారు?” అని అడిగారు. సాధారణంగా ఇటువంటి ప్రశ్నలు భగవాన్ అడగరు. కాని పాపాజీని అడిగారు. దానికి సమాధానం చెప్పి ఇంకా చాలా ధైర్యంగా నేను తలచుకున్నప్పుడల్లా కృష్ణుడితో ఆటలు ఆడుతున్నాను అని సమాధానమిచ్చారు గర్వంగా. మరి ఇప్పుడు కూడా మీరు మాట్లాడినది చూస్తున్నారా? అని అడిగారు. లేదు చూడట్లేదు అని అనడంతో అయితే కృష్ణుడు వచ్చి మీతో ఆటలాడి తర్వాత మాయం అవుతున్నారన్న మాట; అయితే ప్రయోజనం ఏమిటి? అని అన్నారు. ఆ వాక్యం వెనుక ఉన్న గాంభీర్యత ఆయనకి అప్పుడు అర్థం అవక దానిని పట్టించుకోక తిరిగి మద్రాసు వెళ్ళిపోయారు.

## దైవదర్శనం కాదు, మూలాన్వేషణ ముఖ్యం

మద్రాసు వెళ్ళిన ఆయన జపం కాని, ధ్యానం కాని ఏమీ చేయలేక పోయారు. ఆధ్యాత్మిక గ్రంథాలను కూడా చదవలేక పోయారు. కేవలం అంతరంగం లోతులలో ప్రశాంతతను మాత్రమే అనుభవిస్తున్నారు. దేవుని వెతకాలనే కోరిక కూడా లేకుండా పోయింది. ఇదే విషయాన్ని అక్కడి ఎంతోమంది సాధువులను అడిగినా ప్రయోజనం లేకపోయింది. అప్పుడు తనకు అంతకు ముందు మహర్షి వద్దనుండి లభించిన నిశ్చలస్థితి జ్ఞాపకం రావడంతో మళ్ళీ తిరువణ్ణామలై వెళ్ళారు. తన సందేహాన్ని భగవాన్‌కి విన్నవించగా (భగవంతుని గురించి ఆలోచనలు తనకు రానీయడం లేదు అని) అప్పుడు మహర్షి మీరు చేసిన జపము, ధ్యానము మీ ఆధ్యాత్మిక గమ్యాన్ని చేర్చాయి. మీరు తిరువణ్ణామలై రావడానికి రైలు ఎక్కారు. ఆ తర్వాత రైలును వదిలేసి స్టేషన్ నుంచి ఆశ్రమానికి రావడానికి ఎద్దులబండి ఎక్కారు. ఇక్కడికి చేరిన తర్వాత ఆ బండిని వదిలేశారు. అలానే ఆధ్యాత్మిక సాధనలతో పని అయిపోయింది కాబట్టి అవే మిమ్మల్ని విడిచిపెట్టాయి. మీరు ఇక్కడికి (గమ్యానికి) వచ్చారు అని భగవాన్ అన్నారు. అటు తర్వాత తన వైపు భగవాన్ తీక్షణంగా చూడటంతో మనస్సంతా ప్రక్షాళనం చేయబడి ప్రతి అణువు నిర్మలం చేయబడుతున్నట్లుగా గమనించారు. తన కొరకు ఒక కొత్త దేహం తయారవుతున్నట్లుగా అనగా ఇంకో జన్మ వచ్చినట్లు అనిపించింది. ఆ చూపుతో తనకు తెలియకుండానే తన శరీరంలో ఏదో పరివర్తనం జరుగుతున్నట్లుగా

గ్రహించారు. అటు పిమ్మట తనకు ఆత్మానుభవం కలిగిందని అకస్మాత్తుగా గ్రహించారు. ఆ అనుభవం చిన్నప్పుడు తన 8 ఏళ్ళ వయస్సులో కలిగిన అనుభవం వంటిదేనని గ్రహించారు. ఆత్మానుభవాన్ని వర్ణించడానికి వీలుకాదని తన ఆధ్యాత్మిక అన్వేషణ అంతమైనదని మాత్రం ఖచ్చితంగా చెప్పారు. ఆత్మానుభవాన్ని ఎప్పటికీ వర్ణించలేమని స్పష్టం చేశారు. ''దైవము యొక్క దర్శనమును లక్ష్య పెట్టవద్దని దేవుని చూడ వలెను అనుకొనే వాని యొక్క స్వభావమును, వాని మూలమును గురించి అన్వేషించమని'' మహర్షి పాపాజీకి సలహా ఇచ్చారు. అప్పటి నుంచి 'నేను' ఎవరు అనే దాని మీద సాధన చేశారు. మహర్షి పాపాజీకి సద్గురువు అయ్యారు.

## మహర్షి ఆవిష్కరించినది సత్యం

తన చిన్నప్పటి నుంచి భగవంతుడు కోసం చేసిన అన్వేషణలో ఎంతోమంది గురువులను దర్శించుకున్నారు. కాని మహర్షి ఆవిష్కరించిన సత్యాన్ని ఎవరూ చూపలేకపోయారని కాలాంతరంలో భక్తులకు చెప్పారు. మరల తను సాధనను చేయలేని స్థితిలో ఉండటం జరిగింది. అంటే భగవాన్ యొక్క దివ్య వీక్షణంతో తనను కూడా భగవాన్ ఉన్నటువంటి స్థితిలోనే నెలకొల్పారని అర్థమైంది. భగవాన్ వద్ద కలిగినటువంటి ఈ ఆఖరి అనుభవం తర్వాత మద్రాసుకు తిరిగి వెళ్ళారు. అటు తర్వాత కూడా ఉద్యోగ విధులను నిర్వర్తిస్తూ సెలవు దొరికినప్పుడల్లా భగవాన్ వద్దకు వెళ్ళి దివ్యానందంలో మునిగిపోయేవారు. ప్రపంచంలో

జీవించటానికి మనస్సు, ఆలోచన అవసరమనే ధృఢ నిశ్చయానికి వచ్చారు. ఆత్మనిష్ఠుల యొక్క జీవిత భారాన్ని ఏదో ఒక దివ్యశక్తి వెంట ఉండి నడిపిస్తుందని చెప్పేవారు. మానసిక శ్రమ లేకుండానే అన్ని పనులు వాటంతటఅవే సమర్థవంతంగా చేయబడతాయని కూడా ఎల్లప్పుడూ చెప్పేవారు. హిందూ శాస్త్రము ప్రకారం కేవలం ఒక పూర్ణ జ్ఞాని మాత్రమే నిజమైన కర్మయోగి కాగలడు అనడానికి పాపాజీనే ఉదాహరణ. ఆత్మ మాత్రమే స్వచ్ఛమైనది. మిగిలినదంతా కేవలం స్వప్నతుల్యమే అని ఎప్పుడూ భావించేవారు.

## పంజాబ్ ప్రయాణం

భగవాన్ ఎప్పుడూ తమ భక్తులను విద్యుక్త ధర్మాన్ని నెరవేర్చ మనే చెప్పేవారు. తన ధర్మ నిర్వహణకు పంపిన విధానాన్ని పరిశీలిస్తే ఆయన యొక్క ప్రతి మాట ఒక ఆదేశం వంటిదే. ఆ రోజుల్లో పంజాబ్‌లో హింసలు చెలరేగుతుండేవి. దీని మూలంగా హిందువులు, ముస్లింలు వేరు వేరు రైలు పెట్టెల్లో ప్రయాణం చేసేవారు. 1947 జూలైలో తను తన కుటుంబం కోసం భగవాన్ ఆదేశంతో పంజాబ్ వెళ్ళవలసి వచ్చింది. (భగవాన్‌ను విడిచి తనకు వెళ్ళడం ఇష్టం లేదు). 'నీవు ఎక్కడ ఉన్నా నేను నీతోనే ఉంటాను' అని భగవాన్ అనడంతో ఇక తప్పనిసరియై ఆయన పంజాబ్ వెళ్ళారు. పంజాబ్ వెళ్ళేటప్పుడు ముస్లింల కంపార్ట్‌మెంట్‌లో తాను ప్రయాణం చేస్తున్నా తనను ఎవరూ కాల్చి చంపక పోవడం భగవాన్ అనుగ్రహంగా ఆయన గుర్తించారు. ఇంటికి చేరిన ఆయన 34 మంది కుటుంబ సభ్యుల్ని భారతదేశానికి క్షేమంగా తీసుకు

వచ్చారు. వారిలో ఎక్కువ మంది స్త్రీలు ఉన్నారు. ఆ విధిని నెరవేర్చటానికి మహర్షి తనను పంజాబ్‌కు పంపారని పాపాజీ గ్రహించారు. కట్టుబట్టలతో భారతదేశానికి వచ్చిన ఆయన కుటుంబ బాధ్యత ఎక్కువ అవ్వడం తోటి మళ్ళీ సద్గురువు వద్దకు వెళ్ళలేకపోయారు. 1950 ఏప్రిల్ 14న రాత్రి 8.47 నిమిషాలకు లక్నోలో ఆయన వీధిలో నడుస్తుండగా ఛాతిలో తీవ్రమైన నొప్పి వచ్చింది. కొన్ని క్షణాల తర్వాత గమనిస్తే వీధిలోని వారందరూ ఆకాశంలో వెడుతున్న ఉల్కని చూస్తున్నారు. అది మహర్షి మహాసమాధి అయిన క్షణం అని తనకు అప్పుడు తెలిసింది. దానికి ముందు సూచనగానే తనకు ఆ నొప్పి వచ్చిందని అర్థమైంది. అటు తర్వాత లక్నోలో ప్రతిదినం గంగ ఒడ్డున కూర్చొని ధ్యానం చేసుకునేవారు. అలా చేస్తూప్పుడు ఒకరోజు తనకు పూర్వజన్మ దృశ్యాలన్ని కళ్ళముందు కనబడ్డాయి. తన ప్రస్తుతపు జన్మ ఆఖరి జన్మగా కనబడింది. అటు తర్వాత మహర్షి దివ్య దేహం కనబడింది. ఈ విషయాలను ఆయన కాలాంతరంలో భక్తులకు చెప్పారు.

*(ఆధారం: శ్రీరమణమహర్షితో ముఖాముఖి)*

**(శ్రీ రవికృష్ణ శర్మగారు శ్రీరమణజ్యోతి సంపాదకవర్గంలో చేరారు)**

# With a Calm Mind, all Problems can be Tackled

Dr.K.Subrahmanian (Talk No.52)

When we read about the lives of great saints and sages, we are inspired, and we start thinking that there is no purpose in our lives. We feel that we too must get away from family life and retire to some holy place or *ashram* and spend the rest of our lives there. We feel we can be more peaceful there.  But wherever we go, we are taking our mind with us. It is only a change of place, and after the first few days,the initial peace we enjoyed in the new place leaves us. We realize that happiness does not depend on the place; it depends upon our own mind. A mind can make heaven out of hell and a hell out of heaven. It is the same with our jobs. We feel that our current job is a great burden. We do not like the same routine day after day. Whenever something becomes a routine, we get tired and we want to take up something else. But there is no end; we keep on changing, and then we realize that we don't get satisfaction by skipping from one place to another. What is important is not where you are, but how your mind operates.

A person who is devoted to God would like whatever job he is asked to do.  For him, there is no question of choosing. He knows that his job is cut out for his ability. He would not even expect other people to say wonderful things about him. All one can do is this:  do one's job to the best of one's ability.

कर्मण्येवाधिकारस्ते मा फलेषु कदाचन ।

मा कर्मफलहेदुर्भूर्मा ते सङोस्त्वकर्मणि ॥

*Karmanyevaadhikaaraste maaphalesu kadachana*

*Ma karma-phala-heturbhurmaa te sangostuakarmani*

(Bhagavad Gita 2-47)

Success or failure is not in our hands. The fruit of action is given to us by the Lord. This is very easy to say and the most difficult thing to practice. Unless we constantly think of God, we cannot have this attitude. When someone is honest, conscientious and has utmost integrity, instead of getting appreciated, he will find himself the most hated person in the workplace. He will be tested in many ways. Honesty and devotion to the job does not bring appreciation, but unpopularity. Inspite of this, one must be totally honest because it is one's duty. If we expect any kind of appreciation for being honest, we will be disappointed. Even Sri Rama was criticized by some citizens. He brought back Sita after Sita underwent *Agni-pariksha*, but even then a few said, "How can Rama do something like this? She spent one whole year in someone else's place and he is living with her now." This is the way of the world. We have great reverence for Sri Rama, but was he spared?

It is not the question of doing something for ourselves, but when we try to do something for others also, things are not easy. For example, Hanuman did not do even a single thing for himself, and yet he had to face so many problems. Before he crossed the ocean, he was attacked by many *rakshasas*. After he reached Lanka, he was attacked by more *rakshasas*, his tail was set fire to, he had to again fight the *rakshasas* when the war came. The thing that we have to learn from this is this: Hanuman did not even for a single second complain to Rama. He did his duty joyously even when he faced all the problems. Kunti, the aunt of Krishna,

had many problems right from her childhood, and yet when Krishna asked her what she wanted, she said "Give me *vipada* (problems) always, because I will think of you all the time!" To make us think of Him, the Lord will give us problems, but he will give us the strength to fight the problems too. By going to the Himalayas or an *ashram*, we cannot be free from problems.

Unless you are destined, you cannot give up family life and become a *sanyasi*. So, if you do *puja*, *japa* or *dhayana*, your mind becomes calm and what is more, you get the power to face the problems of this world. Everybody has problems, but our attitude towards problems can change, if we have faith in Him. If somebody says, "I will see that you don't have any problems", he is a false prophet. By engaging in religious activities, you cannot expect that problems will go away. But what happens is this: these activities will make your mind become calm. You will then be better equipped to tackle the problem. One other thing is, you must engage in these activities out of love, and not out of fear that God will punish me if I don't do them. God is God of love; God is not a person who will punish you. Bhagavan says, if you have sorrows, God is trying to cleanse you. If there is no suffering, we will become very arrogant. Those who have suffered more have more compassion and understanding.

And so, if we think that we won't have problems if we go somewhere, we are mistaken. If we keep the mind calm, then we can face anything. A calm and clear mind is possible when we surrender to Bhagavan wholeheartedly. He then takes over, and even though you are doing things, you won't feel that you are doing. You will face all the problems effortlessly, and you will have this attitude that he is solving

